క్లుప్తంగా

కోల్‌కతా ఘటనపై న్యాయవాదుల ఆందోళన



భద్రాచలం కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న భద్రాచలం బార్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: కోల్‌కతాలోని కస్బా ప్రాంత న్యాయ కళాశాలలో లా విద్యార్థినిపై అత్యాచారాన్ని ఖండిస్తూ సోమవారం భద్రాచలం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, సీనియర్ న్యాయవాదులు పలివెల నరసింహారావు, శ్రీమన్నారాయణ, అవులూరి సత్యనారాయణ, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ శ్రీ పడిసిరి శ్రీనివాసరావు, సంకా నర్మద, పామరాజు తిరుమలరావు, యు.గౌతమ్, వలవల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'బేస్‌లైన్' పరీక్షలు

కరకగూడెం: విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిని, జ్ఞానాన్ని, నైపుణ్యాలను అంచనా వేయడానికి బేస్‌లైన్ పరీక్షలు ఉపయోగపడతాయని భట్టుపల్లి జెడ్పీ పాఠశాల హెచ్ఎం మోహన్ బాబు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన సోమవారం వారి పాఠశాలలో విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న ఎడ్యుకేషన్ యాప్‌లో పరీక్ష ఫలితాలను నమోదు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు సన్మానం

మణుగూరురూరల్: 2024–25 విద్యాసంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.మహేష్ (570), జె.షణ్ముఖసాయి(520)లను ప్రాఫిట్ షూ కంపెనీ వారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సైలు మేడ ప్రసాద్, రంజిత్‌లు సోమవారం శాలువాలతో సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులకు కళాశాల బ్యాగ్స్, ఒక జత బ్రాండెడ్ షూస్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగశ్రీ, ప్రాఫిట్ షూ కంపెనీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

దుమ్ముగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, కొమురం భీం విగ్రహ ఏర్పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నడికుడి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. ఆగష్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే ములకపాడు గ్రామంలో ప్రతిష్ఠించనున్న కొమరంభీమ్ విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో ఆదివాసీలు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కొమురం దామోదర రావు, కుంజా శ్రీనివాస్, సోయం కామరాజు, తెల్లం హరికృష్ణ, ముర్రం వీరభద్రం, కొర్సా నరేష్, కారం రమేష్, అపకా శ్రీనివాస్, కుర్సం రవి,కారం నవీన్, పాడియం సుబ్బారావు,సోందె వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం వెంకటేశ్వర కాలనీలోని శ్రీఉమా సహిత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ సోమవారం స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యేను శాలువతో ఘనంగా సత్కరించారు. కాగా, ఆషాఢమాసం మొదటి సోమవారం కావడంతో స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

మున్నూరుకాపు సంఘ సమావేశం

ములకలపల్లి: మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగాలని సంఘ మండల అధ్యక్షుడు మేకల పెద్ద వెంకన్న పిలుపునిచ్చారు. ములకలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ మండల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సంఘ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పురుషోత్తానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పాల చందర్‌రావు, శ్రీరాముల నాగేశ్వరరావు, మిర్యాల శ్రీనివాసరావు, పుష్పాల హనుమంతు, బేతాళ వెంకన్న బాబు, అయితా శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు ప్రజల మన్ననలు

- పలు సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు
- క్రిటికల్ కేసుల్లోనూ ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్ల కృషి

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న పలువురు వైద్యులు చిత్తశుద్ధితో చికిత్స అందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఆపద సమయాల్లో, అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన సేవలందిస్తూ ప్రాణాలు నెలబెడుతున్నారు. జిల్లాలో 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లతోపాటు ఏరియా ఆస్పత్రులు కూడా ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు చొప్పున వైద్యులు పనిచేస్తున్నారు. మొత్తం 63 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, అశ్వారావుపేట వంటి ప్రాంతాల్లో ప్రైవేటు రంగంలో కూడా కొందరు వైద్యులు మెరుగైన సేవలందిస్తున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి..



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో బాలుడికి శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడు రామకృష్ణ (ఫైల్)

ప్రజారోగ్యాన్ని కాపాడడంలో ప్రభుత్వ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. డయేరియా, సీజనల్ వ్యాధులు లాంటివి విజృంభించే సమయంలో పీహెచ్‌సీ స్థాయిలోనే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలకుండా జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం ఆస్పత్రికి సరిహద్దు ప్రాంతాల్లోని ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా వచ్చి వైద్యం పొందుతుంటున్నారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7న ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన ఓ బాలుడి మర్మాంగాన్ని పెంపుడు కుక్క కొరికింది. ఆ బాలుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు బాలుడి మర్మాంగానికి శస్త్ర చికిత్స చేసి రక్షించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పందరాజపల్లికి చెందిన శాంతకుమారికి తక్కువ బరువుతో బిడ్డ జన్మించింది. ఆ బిడ్డను ఎస్ఎన్సీయూలో చేర్చి దాదాపు 40 రోజులపాటు వైద్యం అందించి రక్షించారు. చర్ల మండల పరిధిలోని లెనిన్ కాలనీకి చెందిన మడకం రమేష్ కుమార్తె శిరీష ఈ ఏడాది ఏప్రిల్ 1న పురుగుల మందు తాగింది. భద్రాచలం ఆస్పత్రికి తీసుకురాగా దాదాపు 60 రోజుల పాటు ఐసీయూలో ఉంచి మెరుగైన వైద్యం అందించారు. యువతి ప్రాణాలు కాపాడటంతో వైద్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అభినందించారు. ప్రభుత్వం, వైద్యులు చొరవ తీసుకుంటే అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించవచ్చు. అయితే కొన్ని ఆస్పత్రుల్లో నిర్లక్ష్యంతో వ్యవహరించే వైద్యులు కూడా లేకపోలేదు. వారు కూడా వైద్యవృత్తి ఉన్నతిని గుర్తించి సేవలందిస్తే ప్రజల్లో విశ్వాసం, గౌరవం పెరుగుతుంది.

నేడు డాక్టర్స్ డే

దివంగత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత వైద్యుడు, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్య రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి, వర్ధంతి అయిన జూలై 1ని జాతీయ వైద్యుల దినోత్సవంగా 1991 నుంచి నిర్వహిస్తున్నారు.

తక్కువ ఖర్చుకే వైద్యం అందాలి



ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో వైద్య సేవలందాలి. వైద్య రంగానికి ప్రభుత్వాలు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలి. రోగం వచ్చిన తర్వాత నయం చేసే వైద్యం కన్నా ముందస్తు చర్యలుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

వైద్య వృత్తి ఉన్నతమైనది..



ప్రజలు వైద్యులను గౌరవించాలి. అదే సమయంలో వైద్యం కోసం వచ్చే రోగులకు డాక్టర్లు చిత్తశుద్ధితో సేవలందించాలి. వైద్య వృత్తి ఉన్నతమైనది. ప్రతీ రోగిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ, భద్రాచలం

క్రిటికల్ కేసులకు వైద్యం చేశా..



గైనకాలజిస్ట్‌గా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అనేక క్రిటికల్ కేసుల్లో తల్లీ బిడ్డల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేశాను. అత్యవసర కేసులను పరిష్కరించినప్పుడే వైద్యులు దేవుడితో సమానం అనేది ప్రజలు నమ్ముతారు. వైద్య వృత్తి ఎంతో సంతృప్తినిస్తోంది.

– డా. సరోజిని పవన్ కుమార్, గైనకాలజిస్ట్, భద్రాచలం

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెంలో గల పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్ కొత్తగూడెం కేంద్రంగా అక్రమంగా పురుగుమందులు, ఎరువులు దిఉమతి అయ్యాయన్న సమాచారం మేరకు అప్రమత్తమైన వ్యవసాయశాఖ ఏఓ లావణ్య, సీఐ రాజువర్మలు ఆర్.కొత్తగూడెంలోని పురుగుమందులు, ఎరువులు విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ఉన్న స్టాకును పరిశీలించి రిజిష్టర్లను పరిశీలించారు. ఎస్సై నర్సిరెడ్డి, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

అశ్వాపురం ఎస్సైగా నాగేశ్వరరావు



సీఐ అశోక్‌రెడ్డికి బొకే ఇస్తున్న ఎస్సై నాగేశ్వరరావు

అశ్వాపురం: అశ్వాపురం నూతన ఎస్సైగా నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మణుగూరులో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు.. పదోన్నతి పొంది ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. సీఐ అశోక్‌రెడ్డిని నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేయగా సీఐ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ బయ్యారం ఎస్సై బదిలీ

పినపాక: ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రాజ్ కుమార్‌ను కొత్తగూడెం జిల్లాలోని ఐటీ కోర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి ఉత్తర్వులు విలువడ్డాయి. ఈ బయ్యారం ఎస్‌హెచ్‌ఓగా ఐటీ కోర్‌లో విధులు నిర్వహిస్తున్న పి.సురేష్‌ను ఈ స్థానంలో నియమించారు. ఇటీవల ఎస్ఐపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో బదిలీ చేసినట్లు సమాచారం.

భవిష్యత్ ఎన్నికల్లో 'రేగా'ను ఓడిస్తాం..

మణుగూరురూరల్: భవిష్యత్తుల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉండే రేగా కాంతారావును ఓడించి తీరుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడపర్తి రవి అన్నారు. సోమవారం మండలంలోని జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2022లో అశ్వాపురంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ హాజరైన తనను, మరికొంతమంది దళిత నాయకులపై ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న రేగా కాంతారావు కేసులు పెట్టించి ధర్నాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో వెంకటరమణ, నరసింహరావు, వెంకన్న, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'హస్తకళ' శిక్షణతో స్వయం ఉపాధి



శిక్షణ పొందుతున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: నిరుద్యోగ యువతీ యువకులు, మహిళలు కొబ్బరి చిప్పల తయారీ చేసే హస్తకళ శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయంగా ఉపాధి పొందాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ కోరారు. సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ కొబ్బరి బోర్డు సంయుక్తంగా కొబ్బరి హస్తకళ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంట్లో భాగంగా బీహార్‌కు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ నికుంజ ఆధ్వర్యంలో స్థానిక 15 మంది ఔత్సాహిక మహిళలకు కొబ్బరి కాయలు, చిప్పలతో హస్తకళల తయారీ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జూలై 5వ తేదీ వరకూ నిర్వహిస్తామని మాస్టర్ ట్రైనర్ తెలిపారు. అనంతరం కళాశాల డీన్ మాట్లాడుతూ..హస్తకళలు తయారీ చేసే నైపుణ్యాన్ని నేర్చుకొని, భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా బలపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కె.నాగాంజలి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ టి.శ్రావణ్ కుమార్, సూపరింటెండెంట్ రవీంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే



సండ్రలబోడులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: మండలంలో సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. అశ్వాపురం, తురుములగూడెం, గొల్లగూడెం, చింతిర్యాల, సండ్రలబోడు గ్రామ పంచాయతీల్లో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. సండ్రలబోడు నుంచి అమెర్ద మీదుగా చింతిర్యాల కాలనీ వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. సండ్రలబోడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఎమ్మెల్యే సందర్శించి.. విద్యార్థులకు వసతి, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఎం సత్యనారాయణ, ఎంఈఓ వీరస్వామి, ఏపీఓ సీతరామయ్య, ఏఈలు చారి, కిషోర్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

జీఓ 49పై సీపీఎం నిరసన



జీఓ రద్దు చేయాలని ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పినపాక: కార్పొరేట్ సంస్థలకు అడవులను కట్టబెట్టేందుకు జీఓ నంబర్ 49ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దుబ్బా గోవర్ధన్ డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్ నుండి ఉప్పాక బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను లాక్కునేందుకు కొమరం భీమ్ టైగర్ కారిడార్‌ను కేంద్రం తీసుకువచ్చాయని మండిపడ్డారు. వాటిని వెంటనే రద్దు చేయకపోతే భారీ ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు మడివ రమేష్, నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంపై రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాస్

మణుగూరురూరల్: ప్రజాసమస్యలపై, మతోన్మాదంపై రాజీలేని పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రామికభవన్‌లో మండల స్థాయి రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. తొలుత సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం శిక్షణ తరగతుల్లో రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. మత తత్వ రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటోందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ మతోన్మాత రాజకీయాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, నాయకులు కొడిశాల రాములు, దామల్ల వెంకన్న, పిట్టల నాగమణి, బొల్లం రాజు, పద్మ, గౌరి, నాగేశ్వరరావు, భీమయ్య, రాజు, లక్ష్మణరావు, శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినతి

దమ్మపేట: దమ్మపేట ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతూ.. కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు దమ్మపేట కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బస్ స్టేషన్‌లోనికి బస్సులు వెళ్లడానికి బంకు నిర్మాణం అడ్డుగా ఉందని, వెంటనే దానిని నిలిపివేయాలని కోరారు. ఇదే డిమాండ్‌తో కొందరు స్థానికులు దమ్మపేట బస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమాల్లో చిన్నశెట్టి యుగంధర్, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, అత్యం వెంకటేశ్వరరావు, విజయ మారుతిశర్మ, దారా నాగేశ్వరరావు, తంబళ్ల రవి, బండారు సూర్యనారాయణ, జానీబీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు..

ములకలపల్లి: ములకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ సమీపంలో మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్కా అజిత్ ఎమ్మెల్యే జారె ఆదినారాయణను కోరారు. ఈమేరకు సోమవారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేశారు. కిరాణా దుకాణాల్లో మద్యం, గుట్కాల విక్రయాలతో విద్యార్థుల తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, వెంటనే చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు.

చోరీ కేసు నమోదు

దమ్మపేట: తాళం వేసి ఉన్న ఇంటిలోకి గుర్తు తెలియని దుండగులు చొరబడి, బైక్‌ను అపహరించిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలోని కొత్తపేటకు చెందిన నేమాలి లక్ష్మణరావు అనే వ్యక్తి.. అనారోగ్య కారణంగా గత 20 రోజుల నుంచి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అందరూ ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దొంగలు ఆదివారం రాత్రి ఇంటి ముందర తాళం పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. యూనికార్న్ బైక్‌ను దొంగిలించారు. లక్ష్మణరావు భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

హత్య కేసులో ముందస్తు బెయిల్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన కనితి సతీష్ అనే యువకుడిని జూన్ 7న పలువురు హత్య చేశారు. ఇందుకు సంబంధించి పట్టణ పోలీసులు విడతల వారీగా మొత్తం 19 మందిని అరెస్ట్ చేయగా గత గురువారం అనగా 26వ తేదీన హత్య కేసులో ఏ–2 గా ఉన్న అశోక్ అనే వ్యక్తి భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎదుట లొంగిపోయాడు.

తాజాగా ఈ కేసులో ఏ–15గా ఉన్న సునీల్ అనే వ్యక్తి తనను ఆరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టును ఆశ్రయించగా సోమవారం అనగా జూన్ 30న ఇందుకు సంబంధించి ఏ–15ను (సునీల్) అరెస్ట్ చేయొద్దంటూ రూ.25వేలు పూచికత్తుతో సునీల్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

105 శాతం బొగ్గు ఉత్పత్తి



బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడిస్తున్న జీఎం

మణుగూరుటౌన్: ఏరియాలో జూన్ నెలలో 105 శాతం 9.86 లక్షల టన్నులకు 10.36 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. సోమవారం జీఎం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూన్ నెల బొగ్గు, ఓబీ వెలికితీత లక్ష్యాల వివరాలను వెల్లడించారు. ఈ నెల రైలు మార్గం ద్వారా 164 ర్యాక్స్ పంపించడం జరిగిందన్నారు. ఆగస్టులో మణుగూరు ఓసీ ఓబీ వెలికితీత కాంట్రాక్ట్ పనులు ప్రారంభమవుతాయన్నారు. కొత్త సైట్ కార్యాలయం వద్ద సీసీ రోడ్లు, డ్రెయిన్లకు రూ.6.52 కోట్లు మంజూరైనట్లు, వర్ష ప్రభావంతో పనులు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, వెంకట్రావ్, వెంకటరామారావు, అనురాధ, సీతారాంబాబు, బాబుల్ రాజ్, శ్రీనివాస్, డీవైసీఎంఓ జ్యోతిర్మయి, సలగల రమేశ్, ప్రవీణ్, సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మధు

పినపాక: మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలైన రావిశెట్టిగూడెం, చింతలపాడు గ్రామాల్లో సోమవారం పినపాక ప్రభుత్వ వైద్యుడు మధు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతి ఇంటికీ తిరిగి పరిసరాలను పరిశీలించారు. మురికి కాలవలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని వారికి సూచించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

దమ్మపేట: మండల పరిధిలోని నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన సీనియర్ ఉపాధ్యాయుడు పాలా సత్యనారాయణ రెడ్డి పదవీ విరమణ పొందారు. ఈ మేరకు సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా.. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గండుగులపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ, పదవీ విరమణ పొందిన నరసింహారావును శాలువాతో సత్కరించారు. పదవీ విరమణ సందర్భంగా పాఠశాలకు స్టేషనరీ సామగ్రిని వితరణగా అందజేసిన నరసింహారావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలోని సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాల్లో 23 సంవత్సరాల పాటు సేవలందించిన ప్రధానోపాధ్యాయురాలు వివిఎస్. శోభకుమారి పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు..

మణుగూరుటౌన్: ఏరియాలోని వివిధ విభాగాల్లో సుదీర్ఘకాలం సేవలందించి, పదవీ విరమణ పొందిన ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు భద్రయ్య, లక్ష్మణరావులను సోమవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సన్మానించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో వీరిని అధికారులతో కలిసి సన్మానించి, వారి సేవలను కొనియాడారు. జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన భద్రమ్మ, జానకమ్మ, కళావతి, పీవీఎన్‌వీ ప్రసాద్‌లకు ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందించిన అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, భద్రాచలం సీతారామచంద్ర స్వామివారి సమీపంలోని శ్రీకుసుమ హరినాథ బాబా దేవస్థాన కార్య నిర్వాహణాధికారి జి.సుదర్శన్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ యక్కటి శ్రీనివాస్, సభ్యులు తంబళ్ళ కృష్ణార్జునరావు, పునుగుపాటి సీత, ఆలయ అర్చకులు నరసింహాచారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేదెలా ?



అధ్వానంగా మారిన కుదునూరులోని రహదారి

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఈ మార్గాల్లోనే ఇసుక రవాణా జరుగుతుండడంతో లారీలు, ట్రాక్టర్లు తిరుగుతుండగా గుంతలు ఏర్పడి బురదమయమయ్యాయి. దీంతో రైతులు పొలాలకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లాలన్నా, పంట ఉత్పత్తులు తీసుకురావాలన్న సమస్య ఎదురవుతోంది. మండలంలోని కుదునూరు, తేగడ, జీపీపల్లి, సీ కత్తిగూడెం, సుబ్బంపేట తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉండగా.. అధికారులు రహదారుల నిర్వహణపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.